సాక్షి శ్రీకాకుళం

సోమవారం । 31 । మార్చి । 2025



కొబ్బరి రైతు కుదేలు

కొబ్బరి రైతు కుదేలైపోయాడు. దిగుబడులు పడిపోయాయి.


- 8లో



అనుమానాస్పదంగా..

బంటుపల్లి యూబీ పరిశ్రమలో పనిచేస్తున్న వ్యక్తి చనిపోయారు. మృతిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

- 8లో



న్యూస్‌రీల్

వలంటీర్లను నమ్మించి మోసం చేశారు



కృష్ణదాస్‌కు ఉగాది శుభాకాంక్షలు చెబుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

నరసన్నపేట: ఎన్నికల ముందు వలంటీర్లను కొనసాగిస్తామని, వారికి మరింతగా గౌరవ వేతనం పెంచుతామని కూటమి నాయకులు, ముఖ్యమంత్రి చంద్రబాబు హామీలు గుప్పించారని అధికారం చేతికొచ్చాక వలంటీర్లను తొలగించి వారికి తీరని అన్యాయం చేశారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం ఉగాది సందర్భంగా కార్యకర్తలు, నాయకులను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ అమలు చేయకపోగా వలంటీర్లనూ నట్టేట ముంచారన్నారు. రాజకీయ అనుభవం ఉందని గొప్పలు చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి ఇలా హామీలు బుట్ట దాఖలు చేయడంలో ప్రపంచ రికార్డు సాధిస్తారన్నారు. ఉగాది రోజున గత ఐదేళ్లూ బంగారం షాపులు కళకళలాడాయని ఇప్పుడు వెలవెలబోయాయన్నారు. వైఎస్ జగన్ హయాంలో అన్ని వర్గాలకూ మేలు జరిగిందని, ఇప్పుడు కేవలం కూటమి నాయకులకే మేలు జరుగుతుందన్నారు. ధర్మాన కృష్ణదాస్‌ను ఎంపీపీ ఆరంగి మురళి, నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్ నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు కేసీహెచ్‌బీ గుప్త, రాజాపు అప్పన్న, సురంగి నర్సింగరావు, కనపల శేఖర్, బొబ్బాది ఈశ్వరరావు, బుద్దల రాజశేఖర్ తదితర నాయకులు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.


వణికించిన ఇసుక లారీ



దూసి రైల్వే ట్రాక్ నడుమ మొరాయించిన ఇసుక లారీ

ఆమదాలవలస రూరల్: రైల్వే సిబ్బందికి ఓ ఇసుక లారీ భయం పుట్టించింది. ఆమదాలవలస మండలం ముద్దాడపేట ఇసుక రీచ్ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీ ఆదివారం దూసి రైల్వేగేటు వద్ద రెండు ట్రాక్‌ల నడుమ మొరాయించటంతో గేట్‌మెన్‌లు గేటు వేయలేక, తీయలేక నానా ఇబ్బందులు పడ్డారు. బండి సరిగ్గా రైల్వే ట్రాక్‌లు దాటాక గేటు ముందు ఆగిపోయింది. దీంతో రైళ్ల రాకపోకలకు ఇబ్బంది కలగలేదు. కానీ చాలాసేపటి వరకు లారీని తీయడం కుదరకపోవడంతో రైల్వే సిబ్బంది ఇబ్బంది పడ్డారు. ఆ దారిలో వెళ్లిన వాహనాలకు కూడా ఇక్కట్లు తప్పలేదు. నిబంధనలకు మించి ఇసుక లోడింగ్ చేయటం వల్ల లారీ మొరాయించిందని పలువురు అంటున్నారు. విషయం తెలుసుకున్న ఆమదాలవలస పోలీసులు అక్కడకు చేరుకొని వేరే వాహనాలతో లారీని రైల్వేట్రాక్ నుంచి బయటకు తరలించారు.

హోరా హోరీగా జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు



తలపడుతున్న సింగుపురం ఎల్.కొత్తూరు జట్లు

పలాస: పలాస మండలం చినగురుదాసుపురం గ్రామంలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. ఉగాది సందర్భంగా ఆదివారం నాడు చినగురుదాసుపురం ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఆహ్వానిత పోటీలు జరిగాయి. పోటీలకు జిల్లా నలుమూలల నుంచి మొత్తం 21జట్లు పాల్గొన్నాయి. ఇందులో ఇప్పటికే జి.ఎం.పల్లి, సింగుపురం, శ్రీకాకుళం కె.ఆర్ స్టేడియం జట్లు సెమీ ఫైనల్‌కు చేరుకున్నాయి. వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్.శ్రీనివాసరావు, ఎన్.రమేష్, ఎ.ఢిల్లీరావు, ఎన్.రమేష్‌లు రిఫరీలుగా వ్యవహరిస్తున్నారు.

నేడు రంజాన్ ప్రార్థనలు

శ్రీకాకుళం కల్చరల్: రంజాన్ సందర్భంగా ఇమామ్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 9.30కు ప్రార్థనలు జరుగుతాయని అందరు ముస్లింలు పాల్గొనాలని జామియా మసీదు కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మహిబుల్లాఖాన్, అక్బర్ భాషాలు తెలిపారు. అందరూ మసీదుకు 9గంటలకు హాజరుకావాలని కోరారు. అందుకోసం తగిన ఏర్పాట్లు చేశామని తెలిపారు.



నరసన్నపేట: బీసీ బాలికల వసతి గృహంలో ఉగాది వేడుక



విశ్వావసు తొలి వేకువ

శ్రీకాకుళంలో ఉదయాన్నే కురుస్తున్న మంచు

ఊరిలోన.. చైత్ర వీణ

- జిల్లావ్యాప్తంగా ఘనంగా ఉగాది వేడుకలు
- ఊరూరా పంచాంగ పఠనాలు



అష్ట ఫలాలతో విజయదుర్గమ్మ



విశ్వావసుకు స్వాగతం పలుకుతూ కోయిలమ్మలు కొత్త పాటలు కట్టాయి.. వేకువన కువకువలన్నీ ఆ పాటలతోనే గడిచాయి. ఊరూవాడా కోవెల వాకిటే కూర్చున్నాయి.. ఆదాయ వ్యయాలను, రాజపూజ్య అవమానాలను ఆరారా విన్నాయి. అన్నదాతలంతా నాగళ్లు చేతబట్టారు.. ఏరువాక సాగారో అంటూ హుషారైన పాటందుకున్నారు. **కొత్త** చిగుర్లతో ప్రకృతి చైత్రవీణ మోగించింది. తెలుగు వారి కొత్త ఏడాది నాడు ఆలయాల్లో అమ్మవార్లు ప్రత్యేక అలంకరణల్లో మెరిసిపోయారు. జనమంతా వసుధైక కుటుంబంలా కలిసిమెలిసి విశ్వావసుకు స్వాగతం పలికారు.

● ఆదిత్యుని ఆదాయం 11.. వ్యయం 5



ఉగాది ఆస్థానంలో స్వామి రాశిఫలాలను వివరిస్తున్న శంకరశర్మ, పక్కనే ఈఓ భద్రాజీ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఆలయ అనివెట్టి మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికలో ఉగాది ఆస్థానాన్ని ఆలయ ఈఓ వై.భద్రాజీ, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి ముందుగా పంచాంగ పూజ, ఆలయ కొత్త రికార్డు పుస్తకాలు, అకౌంట్స్ పుస్తకాల పూజా కార్యక్రమాలను చేయించారు. అనంతరం ఆదిత్యుని రాశిఫలాలుగా విశాఖ నక్షత్రం, తులా రాశి ఫలాలను శంకరశర్మ వివరించారు. ఈమేరకు ఆదాయం 11, వ్యయం 5 గాను ఉందని, గత ఏడాది కంటే మిన్నగా ఆలయంలో ప్రగతి కనిపించే అవకాశాలున్నాయని వివరించారు. అనంతరం రాష్ట్ర దేవదాయ శాఖ ఆదేశాల ప్రకారం ఆలయంలో విశిష్ట సేవలకు గాను ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, నగేష్ రాజేశ్వర కాశ్యప శర్మ, వేదపండితులు ధర్బముళ్ల శ్రీనివాసశర్మ, రంప వికాష్ శర్మలకు ఉగాది పురస్కారాలను ఆలయ ఈఓ వై.భద్రాజీ అందజేసి ఘనంగా సత్కరించారు. అనంతరం ఆలయం పేరిట ముద్రించిన కొత్త పంచాంగం పుస్తకాలను భక్తులకు దాతలకు అందజేశారు. ఈ సందర్భంగా అనివెట్టి మండపంలో పంచాంగ శ్రవణం కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం నిర్వహించారు.



సారవకోట: ఆర్.కిన్నెరవాడలో పంచాంగ పఠనాన్ని ఆలకిస్తున్న గ్రామస్తులు



టెక్కలి రూరల్: కిటకిటలాడిన బంగారం షాపు

● అందరికీ మంచి జరగాలి: కలెక్టర్

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా ప్రజలందరికీ మంచి జరగాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆకాంక్షించారు. స్థానిక అంబేడ్కర్ ఆడిటోరియంలో రాష్ట్ర ప్రభుత్వ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో విశ్వావసు ఉగాది వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తూ ఉగాది పచ్చడిలోని అన్ని రుచులు ఉన్నట్లే మంచి, చెడులు ఉంటాయని వాటన్నింటిని గెలుచుకొని ముందుకు సాగాలని కోరారు. ముందుగా ధర్మపురి గౌరీశంకరశాస్త్రి పంచాంగ పఠనం చేశారు.



పంచాంగ శ్రవణం చేస్తున్న గౌరీశంకరశాస్త్రి



ఉగాది పచ్చడి తింటున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

అర్చకులకు సత్కారాలు

దేవాదాయశాఖ ఎంపిక చేసిన ముగ్గురు అర్చకులకు ఉగాది పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా గుడివీధిలోని ఉమారుద్రకోటేశ్వర స్వామి ఆలయ అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తిని, కవిటి మండలం బెజ్జిపుట్టుగ శ్రీచక్రపెరుమాళ్ల అర్చకులు బాలక సత్యనారాయణ, కంచిలి మండలం కొల్లూరు శ్రీజగన్నాథ స్వామి ఆలయ అర్చకులు పద్మనాభ పాడిలను సత్కరించి వారికి నగదు పారితోషికాలను అందించారు. అలాగే పంచాంగకర్త గౌరీశంకరశాస్త్రిని కూడా సత్కరించారు.

ఆకట్టుకున్న కవి సమ్మేళనం

ఈ సందర్భంగా గాయత్రీ కళాశాల ప్రిన్సిపాల్ పులఖండం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కవులు కె.వి.రాజారావు, బొంతు సూర్యనారాయణ, పాట్నూరు సుబ్రహ్మణ్యం, ఈ వేమన, ఉపకలెక్టర్ సవరమ్మ, శ్రీనివాసరావు, ఆరవెల్లి అనంతరామం, దామోదరాచారి, రమణమూర్తి, నాగేశ్వరరావు, భోగిల ఉమామహేశ్వరరావు, పూడి జనార్ధనరావులు కవి సమ్మేళనంలో పాల్గొని ఉగాది కవితలను వినిపించారు. అనంతరం వారిని సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, ఉపకలెక్టర్ లక్ష్మణరావు తదితరులు హాజరయ్యారు.

మాజీ మంత్రి అప్పలరాజుపై కేసు నమోదు

కాశీబుగ్గ: మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుపై కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. పలాస మండలం చిన్ననీలావతి గ్రామానికి చెందిన తెప్పల ఢిల్లీరావు అనే వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెంది మూడు నెలలు గడుస్తున్నా పోలీసు దర్యాప్తు ఆలస్యం అవుతుండడంతో ఆయన బాధితుల కుటుంబ సభ్యులతో కలిసి డీఎస్పీ వెంకటఅప్పారావు, సీఐ సూర్యనారాయణను శుక్రవారం నిలదీశారు. దీంతో స్టేషన్‌లో నిర్వహించే ఎస్పీ గ్రీవెన్స్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు ఆటంక పరిచినట్లు డాక్టర్ సీదిరి అప్పలరాజుతో పాటు తన అనుచరులు 16 మందిపై కేసు నమోదు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు సీదిరిపై మూడు కేసులు నమోదు చేయగా ఇది నాలుగోది కావడం గమనార్హం.

దేవాలయ గోడలపై అన్యమత ప్రచారం



ఆలయం గోడలపై రాతలు, శిలువ గుర్తులు

- యలమంచిలి, అక్కురాడ, కొండపోలవలస గ్రామాల్లో ఆలయాల గోడలపై రాతలు
- ఆగ్రహం వ్యక్తం చేసిన గ్రామస్తులు
- యలమంచిలిలో ఉద్రిక్త పరిస్థితులు



ఆలయంలో ఆందోళన తర్వాత రామనామ కీర్తనలు ఆలపిస్తున్న శ్రీనివాసానంద సరస్వతి, బీజేపీ నాయకులు, విశ్వహిందూ పరిషత్ సభ్యులు తదితరులు



ఘటనా స్థలం వద్ద వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి

జలుమూరు: ఉగాది రోజున మండలంలోని యలమంచిలిలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. గ్రామంలోని దాదాపు 300 ఏళ్ల పురాతన మల్లికార్జున స్వామి ఆలయం గోడలపై శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు శిలువ గుర్తులు వేసి, ఆ మతానికి సంబంధించిన రాతలు రాశారు. ఆదివారం వేకువజామున అర్చకులు వసనాబి వెంకటరమణ ఆలయానికి వచ్చి గోడలపై రాతలు చూసి గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. ఈ వార్త దావానలంలా వ్యాపించడంతో పోలీసులు రంగంలోకి దిగారు. ఈ ఆలయంతో పాటు పక్క పంచాయతీలైన అక్కురాడ, కొండపోలవలసలోని ఆంజనేయ ఆలయాల్లో కూడా ఇలాంటి రాతలే రాశారు. దీంతో మూడు గ్రామస్తులతో పాటు విశ్వహిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్, భజరంగదళ్, బీజేపీ నాయకులు, ఆనంద ఆశ్రమ వ్యవస్థాపకుడు శ్రీనివాసనంద సరస్వతి తదితరులు యలమంచిలి శివాలయం వద్దకు చేరుకొని ఆందోళన చేశారు. అంతకుముందు అక్కురాడ, కొండపోలవలసలో రాతలను చెరిపేశారు. యలమంచిలిలో పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్, టెక్కలి, శ్రీకాకుళం, పలాస డీఎస్పీలు డీఎస్ఆర్ఎస్ఎన్ మూర్తి, వివేకానంద, అప్పారావు పలువురు సీఐ, ఎస్ఐలు ఘటనా స్థలానికి చేరుకున్నారు. రాసిన వారిని రెండు రోజుల్లో పట్టుకుంటామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. ఈ రాతలు రాసిన వారిని పట్టుకునేందుకు ఐదు బృందాలను ఏర్పాటు చేసినట్టు ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి తెలిపారు. దీనికి ముందు ఆయన మూడు ఆలయాలను పరిశీలించారు. అర్చకుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇన్‌చార్జి ఎస్ఐ బి.అనిల్‌కుమార్ కేసు నమోదు చేశారు.

రేపటి నుంచే ఇంటర్ తరగతులు



- ఇంటర్మీడియెట్ విద్యలో కీలక పరిణామాలు
- ఏప్రిల్ ఒకటి నుంచి సర్కారీ జూనియర్ కళాశాలలు పునఃప్రారంభం
- 7 నుంచి అడ్మిషన్లు చేయాలని ఇప్పటికే నిర్ణయం
- ప్రైవేటు కళాశాలలకు పోటీగా అడ్మిషన్ల కోసం ఇంటర్ విద్య డైరెక్టర్ నిర్ణయాలు
- కొత్త ఏడాదిలో 235 రోజుల పాటు పనిచేయనున్న జూనియర్ కళాశాలలు

శ్రీకాకుళం న్యూకాలనీ:

ప్రభుత్వ యాజమాన్య జూనియర్ కళాశాలలు మంగళవారం నుంచి పునఃప్రారంభం కానున్నాయి. సెకెండియర్ విద్యార్థులకు తరగతులు మొదలు కానున్నాయి. వాస్తవానికి ఏటా జూన్ ఒకటి నుంచి తరగతులు ప్రారంభమవుతుండగా.. ఈ ఏడాది ఏప్రిల్ ఒకటి నుంచే తరగతులను నిర్వహించాలని ఇంటర్ విద్య డైరెక్టర్ నిర్ణయించారు. అలాగే ప్రైవేటు కాలేజీలకు పోటీగా ఏప్రిల్ ఒకటి నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఫస్టియర్ ప్రవేశాలకు అడ్మిషన్లు మొదలుపెట్టాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ విషయమై జిల్లా అధికారులు, ప్రిన్సిపాళ్లకు వెబెక్స్ ద్వారా దిశానిర్దేశం చేశారు.

ఇప్పటికే అడ్మిషన్ డ్రైవ్ నిర్వహణ..

జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం ఇప్పటికే అధికారుల ఆదేశానుసారం అడ్మిషన్ డ్రైవ్ (క్యాంపెయినింగ్‌లు) నిర్వహించారు. ఫిబ్రవరి మూడు, నాలుగు వారాల్లో కళాశాలలకు సమీప ప్రాంతాల్లో ఉన్న సర్కారీ పాఠశాలల్లో, గ్రామాల్లో ప్రిన్సిపాళ్ల, అధ్యాపకులు అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించారు.

235 రోజులు పనిదినాలు..

2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్ కోర్సులను అందిస్తున్న జూనియర్ కళాశాలలు 235 రోజులు పనిచేయనున్నాయి. ఏప్రిల్ 1న కాలేజీలు మొదలుకానుండగా, వేసవి సెలవులను ఏప్రిల్ 24 నుంచి జూన్ ఒకటో తేదీగా ప్రకటించారు. మళ్లీ జూన్ 2వ తేదీన పూర్తిస్థాయిలో కాలేజీలు పునఃప్రారంభం కానున్నాయి. ఆఖరి పనిదినంగా 2026 మార్చి 18ను నిర్ణయించారు.

అడ్మిషన్లు పెంచడమే లక్ష్యం..




ప్రభుత్వ కళాశాలల్లో నిష్ణాతులైన అధ్యాపకులతో పాఠాలు బోధించడంతోపాటు అన్ని వసతులు, సౌకర్యాలతో విద్య అందుతోంది. పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, బ్యాగులతోపాటు మధ్యాహ్న భోజనం కూడా అమలవుతోంది. ఈ ఏడాది అడ్మిషన్లను భారీగా పెంచేందుకు ఇంటర్ విద్య ఉన్నతాధికారులు పకడ్బందీ చర్యలు చేపడుతున్నారు. ప్రభుత్వ కళాశాలల్లో చేరేందుకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆసక్తి చూపిస్తున్నారు.

– శివ్వాల తవిటినాయుడు, ఇంటర్మీడియెట్ విద్య జిల్లా అధికారి(డీఐఈవో), శ్రీకాకుళం

చారిత్రక జ్ఞాపకం





పురాతన కాలం నాటి జామియా మసీదు (ఫైల్) (ఇన్‌సెట్లో) అప్పట్లో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

జిల్లా కేంద్రంలోని జీటీ రోడ్డులో ఉన్న పురాతన కట్టడం జామియా మసీదు. దీన్ని సుమారు 400 ఏళ్ల కిందట కట్టినట్టు ఆధారాలు చెబుతున్నాయి. అప్పట్లో గోల్కొండ నవాబులు జిల్లాను షేర్‌మహ్మద్ పురం రాజధానిగా పాలించేవారు. అప్పట్లోనే 1636లో షేర్ మహ్మద్ ఖాన్ పరిపాలనలో 18 ఎకరాల విస్తీర్ణంలో దీన్ని నిర్మించారు. మసీదులో రెండు రాతి బావులను తవ్వించారు. ఈ బావుల నుంచి నీటిని ఏనుగుల ద్వారా తీసుకొచ్చి వజూఖానాకు తరలించేవారట. ఆ సమయంలోనే 365 మసీదులు ఉండేవి. అయితే అప్పటిలో జామియా మసీదే అతి పెద్ద మసీదుగా పేరుపొందింది. దీని చుట్టూ అందమైన తోటను కూడా పెంచేవారు.

– శ్రీకాకుళం కల్చరల్





ప్రస్తుతం జామియా మసీదు (ఇన్‌సెట్లో) పురాతన కాలం నాటి రాతి నుయ్యి

క్లుప్తంగా

మిలటరీ క్యాంటీన్‌లో సెల్ఫ్ సర్వీసు



కార్యక్రమంలో పాల్గొన్న మాజీ సైనికులు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక మిలటరీ క్యాంటీన్‌లో లిక్కర్ సెల్ఫ్ సర్వీసును జిల్లా ఎక్స్ సర్వీసు మెన్ ఫెడరేషన్ శ్రీకాకుళం చైర్మన్ విశ్రాంత గ్రూప్ కెప్టెన్ పి.ఈశ్వరరావు ఆదివారం ప్రారంభించారు. మాజీ సైనికులందరూ దీన్ని సక్రమంగా వినియోగించుకోవాలని జిల్లా మాజీ సైనికుల ఫెడరేషన్ అధ్యక్షుడు కటకం పూర్ణచంద్రరావు సూచించారు. క్యాంటిన్ మేనేజర్ సుబేదార్ మేజర్ పి.గోవిందరావు అందుబాటులోకి తీసుకు వచ్చినందుకు మాజీ సైనికుల తరపున ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో హానరరీ ప్రెసిడెంట్ బి.సంజీవరావు, వైస్ ప్రెసిడెంట్ వి.సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి పి.మురళీధరరావు, కోశాధికారి ఎం.సింహాచలం, స్పోక్స్ పర్సన్ కె.కన్నారావు, చింతు రామారావు, ఏవీ జగన్మోహనరావు, వీరనాటి పి.భారతమ్మ, ఎ.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం



రోడ్డుపై విరిగిపడిన మర్రిచెట్టు కొమ్మ


వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని బాతుపురం–చినవంక ఆర్అండ్‌బీ రోడ్డులో ఆదివారం సాయంత్రం ఒక భారీ మర్రిచెట్టు కొమ్మ రోడ్డుపై విరిగిపడింది. అయితే ఆ సమయంలో వాహన రాకపోకలు, ప్రయాణికులు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ఈ రోడ్డులో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. చెట్టుకొమ్మ రోడ్డుకి అడ్డంగా పడడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో స్థానికులంతా కలిసి చెట్టుకొమ్మను తొలగించారు.

కొబ్బరి రైతు కుదేలు..!

- వర్షాభావం, తెగుళ్ల తాకిడితో ఇబ్బందులు
- పడిపోయిన దిగుబడులు
- వలసబాట పడుతున్న రైతులు, కూలీలు



తెల్లదోమ ఆశించిన కొబ్బరి చెట్లు



కంచిలి:

ఉద్దానం ప్రజల జీవనాధారంగా ఉన్న కొబ్బరి పంటకు తీవ్రమైన తెగుళ్లతో రైతు కుదేలవుతున్నాడు. గడిచిన నాలుగేళ్లుగా వర్షాభావ పరిస్థితులు, అంతకుముందు తిత్లీ తుఫాన్ ప్రభావం వెరసి కొబ్బరి పంటపై తెగుళ్ల దాడి తీవ్రతరమైంది. అలాగే భూసారం తగ్గి దిగుబడులు గణనీయంగా పడిపోయాయి. తాజాగా మళ్లీ తెల్లదోమ ఉధృతి పెరగడంతో మరింతగా దిగుబడులు తగ్గిపోయాయి. దోమ నివారణకు ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో కొబ్బరి పంటే జీవనాధారంగా ఉన్న బతుకులు అగమ్యగోచరమయ్యాయి. దిగుబడులు లేకపోవడంతో రైతుతోపాటు, అందులో పనిచేసే కూలీల కుటుంబాలు కూడా పని దొరక్క ఇబ్బందులు పడుతున్నాయి. మొదట్లో కూలీలకు పని దొరక్క వలసలు ప్రారంభం కాగా, ఇప్పుడు దిగుబడులు లేకపోవడంతో రైతులు కూడా ప్రత్యామ్నాయ జీవనానికి వలస బాట పడుతుండడం ఇక్కడి తీవ్రత తెలియజేస్తోంది.

మట్టిలో తగ్గిన సాంద్రత



ఉద్దాన ప్రాంతంలో వర్షాభావ పరిస్థితులతో మట్టి సాంద్రత చాలా వరకు తగ్గినట్లు స్పష్టమవుతోంది. దీనివలన కొత్తగా కొబ్బరి మొక్కలు వేస్తున్నప్పటికీ ఎదుగుదల తక్కువగా ఉంది. అలాగే వాటికి తెల్లదోమ ఆశించడం వలన కూడా చనిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. ఒక ఎకరాకు 20 నుంచి 30 మొక్కలు నాటుతుంటే, వాటిలో నాలుగైదు కూడా బతకడం కష్టంగా ఉందంటున్నారు. చీడపీడల నివారణకు శాస్త్రవేత్తలు, నిపుణులు సలహాలు అందకపోవడం వలన మరింత నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. స్థానికంగా కొబ్బరి పరిశోధన కేంద్రం లేకపోవడం, ఇటీవల సోంపేటలో ఏర్పాటు చేసిన బదనికల కేంద్రం కూడా ఎత్తివేయడంతో రైతుకు ఉద్యానశాఖ పరంగా ఎటువంటి భరోసా లేని దుస్థితి ఏర్పడింది.

అంతరపంట జీడిపై ప్రభావం

కొబ్బరికి ఆశించిన తెగుళ్ల కారణంగా దిగుబడులు పూర్తిగా తగ్గిపోయాయి. తిత్లీ తుఫాన్‌కు ముందు ఒక ఎకరాలకు 10 పనాలు(80 కాయలు ఒక పనం) దిగుబడి వస్తే, ప్రస్తుతం ఒకటిన్నర నుంచి రెండు పనాలు మాత్రమే వస్తోంది. దిగుబడులు తగ్గిపోవడం వలన వచ్చిన కాయలను పక్కనే ఉన్న ఒడిశా మార్కెట్‌కు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. కొబ్బరికి ఆశించిన పురుగులే, అంతర పంటగా ఉన్నటువంటి జీడికి కూడా ఆశించడం వలన వాటి దిగుబడులు పైన కూడా ప్రభావం చూపుతోంది. ఈ మధ్య కాలంలో తీవ్రమైన మంచు కురవడం, పురుగుల తాకిడి వలన వాటి దిగుబడులు కూడా తగ్గాయని రైతులు వాపోతున్నారు.

వలస పురుగుల ప్రభావం

ఉద్దానం ప్రాంతానికి చెందిన కొందరు కొబ్బరి వ్యాపారులు ఉభయ గోదావరి జిల్లాల నుంచి కాయలను దిగుమతి చేసుకొని, ఇక్కడ తోటల్లో నిల్వ చేసి, ఎగుమతులు చేయడం వలన ఆ ప్రాంతం నుంచి తెల్లదోమ తదితర పురుగులు వలస వచ్చాయని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విమర్శలు చాలాకాలంగా వస్తున్నప్పటికీ సంబంధిత వ్యాపారులు మాత్రం అవేవీ పట్టించుకోవడం లేదు. అక్కడి కాయలు చవగ్గా వస్తున్నాయని దిగుమతి చేసుకొని, ఇక్కడి కాయలతో కలిపి ఎగుమతులు చేస్తున్నారని అంటున్నారు.

అవగాహన అవసరం



ఉద్దానం ప్రాంతంలో కొబ్బరికి ఆశించిన తెగుళ్లను నివారించడానికి రైతులంతా ఉద్యానశాఖ సలహాలు తీసుకొని మూకుమ్మడిగా నివారణ చర్యలు చేపట్టాలి. పెద్దపేట ఉద్యాన పరిశోధన కేంద్రంలో బదనకలు అందుబాటులో ఉన్నాయి. రైతులు వీటిని మూకుమ్మడిగా వినియోగించి నివారణ చర్యలు చేపట్టాలి. రసాయన ఎరువుల జోలికి వెళ్లకూడదు. వేపనూనె పిచికారీ చేయడం వంటి చర్యలతో కొంతమేర ఉపశమనం కలుగుతుంది.

– పి.మాధవీలత, ఉద్యానశాఖ అధికారి, కవిటి

వలసబాట పడుతున్నారు



గతంలో ఎంతోబాగా దిగుబడులు వచ్చేవి. కానీ గత కొన్నేళ్లుగా వర్షాభావం, తెగుళ్ల తాకిడి కారణంగా దిగుబడులు తగ్గిపోయాయి. ఇలాగే పరిస్థితి కొనసాగడంతో గతంలో పనుల్లేక కూలీలు వలసబాట పట్టారు. ఇప్పుడు మరలా ఎంతోమంది చిన్న రైతులు వలసబాట పడుతున్నారు. పరిస్థితి చూస్తుంటే ఆవేదనగా ఉంది.

– ప్రధాన లజపతి, కొబ్బరి రైతు, పెద్దకొజ్జిరియా గ్రామం

పరిస్థితి దారుణంగా ఉంది



అధికారులు తెగుళ్ల నివారణ చేపట్టకపోవడంతో ఉద్దాన ప్రాంతంలో కొబ్బరి పంటల పరిస్థితి దారుణంగా ఉంది. తిత్లీ తుఫాన్ తర్వాత తోటల్లో కొబ్బరి చెట్లు చాలా వరకు దెబ్బతిన్నాయి. అనంతరం ఇప్పుడు ఈ తెగుళ్ల ఉధృతి విపరీతంగా పెరగడంతో రైతు కోలుకోవడం కష్టంగా మారింది. ప్రభుత్వం తక్షణమే అవసరమైన చర్యలు చేపట్టకపోతే రైతులు నష్టాల్లో కూరుకుపోతారు.


– పలికల జయరాం, కొబ్బరి రైతు, జాడుపూడి గ్రామం

ఆచార్య దేవ.. సాహిత్యానికి సేవ..!



ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ అవార్డు అందుకుంటున్న రాజారావు(ఫైల్)

- తెలుగు వెలుగులకు కృషి చేస్తున్న రాజారావు
- ఈ ఏడాది ఉగాది పురస్కారానికి ఎంపిక
- అనేక రచనలతో తెలుగు భాషాభివృద్ధికి కృషి



వావిలపల్లి రాజారావు

పొందూరు: ఆయన ఆంగ్ల భాష ఉపాధ్యాయుడు. కానీ తెలుగు భాషంటే ఆరోప్రాణం. ఎంఏ(తెలుగు), ఎంఏ(హిస్టరీ), ఎంఏ(రాజనీతి శాస్త్రం), ఎంఏ(ఇంగ్లిష్) పూర్తిచేసి, తెలుగు సాహిత్య రంగానికి ఎనలేని సేవలు అందిస్తున్నారు. ఇప్పటివరకు 400 కవితలు, 92 వ్యాసాలు, 53 కథలు రచించారు. అలాగే యువతను చైతన్యం చేయడంతో పాటు ఉద్యోగాలకు సిద్ధమయ్యేలా తీర్చిదిద్దేందుకు ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంస్థ ద్వారా జిల్లాలో సుమారు 42 గ్రామాల్లో గ్రంథాలయాలను ప్రారంభించారు. అతనే పొందూరు మండలంలోని వావిలపల్లిపేటకు చెందిన వావిలపల్లి రాజారావు. ప్రస్తుతం జి.సిగడాం మండలంలోని ఆనందపురం అగ్రహారం ఎంపీయూపీ పాఠశాలలో ఇంగ్లిష్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. ఈయన సేవలకు మెచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది ఉగాది పురస్కారం అందజేసింది.

ఎనలేని కృషి

వావిలపల్లి రాజారావు ఎందరో మహానుభావులు (వ్యాస సంపుటి), మహోన్నత శిఖరాలు (శతాధిక కవితా మాలిక), నా దేశం (శతాధిక కవితా మాలిక), వికసిత విశ్వంబర (శతాధిక కవితా మాలిక) తదితర పుస్తకాలు రాశారు. అలాగే బాలభారతం, తెలుగు వెలుగు, తెలుగు విద్యార్థి, సాహితీ కిరణం, భక్తి సమాచారం, విశాఖ సంస్కృతి మొదలైన మాస పత్రికల్లో ఆయన రాసిన అనేక కథలు, కవితలు, వ్యాసాలు ప్రచురితమయ్యాయి. భగవద్గీతలో అర్జున విషాదయోగాన్ని తెలుగులో విశ్లేషణాత్మకంగా రాశారు. శ్రీకాకుళం జిల్లా శాఖ శ్రీశ్రీ కళావేదిక ప్రధాన కార్యదర్శిగా, ప్రపంచ తెలుగు రచయితల సంఘం జీవితకాల సభ్యుడిగా, ఉత్తరాంధ్ర రచయితల వేదిక క్రియాశీల సభ్యుడిగా, జిల్లా తెలుగు రచయితల వేదిక క్రియాశీల సభ్యుడిగా, ఏపీ గ్రంథాలయ సంఘం శ్రీకాకుళం జిల్లా ఉపాధ్యక్షుడిగా సాహితీ రంగానికి ఎనలేని సేవలందిస్తున్నారు.

యువతను చైతన్యం చేసేలా...

ప్రజలను, యువతను చైతన్యం చేసేందుకు, విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు గ్రంథాలయాలు స్థాపించారు. ప్రస్తుతం పోటీ ప్రపంచాన్ని యువత తట్టుకుని నిలబడేందుకు, ఉన్నతంగా స్థిరపడేందుకు గ్రంథాలయాలు దోహదం చేస్తాయన్న విశ్వాసంతో ముందుకు నడుస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంస్థ ద్వారా జిల్లాలోని పొందూరు, రణస్థలం తదితర మండలాల్లో సుమారు 42 గ్రంథాలయాలు స్థాపించారు. గ్రంథాలయాలను యువత వినియోగించుకొని ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షిస్తున్నారు.

అందుకున్న పురస్కారాలు

విద్యా రంగానికి రాజారావు చేసిన సేవలకు గానూ 2017లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా, 2018లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. చేయూత సామాజిక సేవా సంస్థ 2024లో ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ అవార్డును అందించింది. తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ గోల్డ్ మెడల్ పురస్కారం 2024లో అందుకున్నారు. అనంతపురంలో జాతీయ తెలుగు రక్షణ వేదిక నిర్వహించిన ప్రపంచ రికార్డు కవి సమ్మేళనంలో పురస్కారం అందుకున్నారు. 4వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభ, 5వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలో పాల్గొన్నారు. 5వ, 6వ ప్రపంచ తెలుగు మహాసభల్లో పురస్కారాలు, ప్రశంసాపత్రాలు పొందారు. అవనిగడ్డలో నిర్వహించిన సహస్ర కవి సమ్మేళనంలో తెలుగు లోగిలి పురస్కారం(2018), ఏపీ భాషా సాంస్కృతిక శాఖ, ఉత్తరాంధ్ర తెలుగు రచయితల వేదిక సంయుక్త సదస్సు(విశాఖపట్నం–2018)లో పురస్కారాన్ని, 2022లో తెలుగు భాషా పరిరక్షణ సమితి(2022) పురస్కారం అందుకున్నారు. విజయవాడలో ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతులమీదుగా ఉగాది పురస్కారాన్ని ఆదివారం అందుకున్నారు.

పచ్చ తమ్ముడి బరితెగింపు

- అధికారుల మాట బేఖాతర్
- రచ్చబండను నేలమట్టం చేసిన వైనం



రచ్చబండను తొలగిస్తున్న టీడీపీ నాయకుడి అనుచరులు



ఏళ్లనాటి రావిచెట్టు

ఇచ్ఛాపురం రూరల్: అధికారంలో ఉన్నామన్న అహంకారంతో టీడీపీ నాయకుడు బరితెగించాడు. తన స్థలానికి అడ్డుగా ఉన్నటువంటి 30 ఏళ్ల నాటి రచ్చబండను నేలమట్టం చేశాడు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని కె.శాసనాం గ్రామంలో 30 ఏళ్ల క్రితం స్థానిక గ్రామ పెద్ద కారంగి కారయ్య అనే వ్యక్తి రచ్చబండను నిర్మించాడు. అందులో రావి చెట్టును నాటి త్రినాథస్వాముల వారి విగ్రహాలను ప్రతిష్ఠించారు. అయితే అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ఇసురు ఫకీరు తన సొంత భూమికి రచ్చబండ అడ్డుగా ఉందంటూ, ఈనెల 19న రచ్చబండను పెకిలించేందుకు ప్రయత్నించాడు. దీంతో గ్రామస్తులు పోలీసు, రెవెన్యూశాఖాధికారులకు ఫిర్యాదులు చేశారు. తహసీల్దార్ ఎస్.వెంకటరావు ఆదేశాల మేరకు ఈనెల 21, 23 తేదీల్లో మండల, గ్రామ సర్వేయర్లు, వీఆర్వో సంఘటనా స్థలానికి వెళ్లి కొలతలు తీశారు. రచ్చబండ ప్రభుత్వ స్థలంలో ఉందని, రచ్చబండకు పది అడుగుల దూరంలో ఫకీరు స్థలం ఉందని తేల్చి చెప్పారు. రచ్చబండపై ఫకీరుకు ఎటువంటి అధికారం లేదని, తొలగించేందుకు ప్రయత్నిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయితే తమ ప్రభుత్వం అధికారంలో ఉండడంతో అధికారుల మాటలు బేఖాతరు చేస్తూ, ఇసురు ఫకీరు తన అనుచరులతో ఆదివారం రచ్చబండను కూల్చడంతో పాటు 30 ఏళ్ల నాటి చెట్టును తొలగించేశాడు. దీంతో సదరు వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అనుమానాస్పదంగా ఉద్యోగి మృతి



ఆందోళన చేపడుతున్న కుటుంబ సభ్యులు



ఉరికి వేలాడుతున్న అప్పలసూరి మృతదేహం

రణస్థలం: మండలంలోని బంటుపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న యూనైటెడ్ బ్రూవరీస్ పరిశ్రమలో పనిచేస్తున్న ఉద్యోగి పిన్నింటి అప్పలసూరి(47) అనుమానాస్పదంగా మృతి చెందాడు. జేఆర్‌పురం పోలీసులు, పరిశ్రమ వర్గాలు తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం జనరల్ డ్యూటీకి వెళ్లిన మృతుడు అప్పలసూరి సాయంత్రం 4.30 గంటల సమయంలో పరిశ్రమలోని వాష్ రూమ్‌లో ప్లాస్టిక్ పైపునకు ప్యాకింగ్ రోప్‌తో ఉరి వేసుకుని చనిపోయి ఉన్నాడు. కొంత సమయం తర్వాత గుర్తించిన తోటి ఉద్యోగులు జేఆర్‌పురం పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈయన పరిశ్రమలోని కేస్ ప్యాకర్ మిషన్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. బంటుపల్లి పంచాయతీ ప్రజలకు ఆర్ఎంపీగా వైద్య సేవలు అందిస్తుంటాడని గ్రామస్తులు చెబుతున్నారు. అయితే ఉరివేసుకుని చనిపోయి ఉండడంపై కుటుంబ సభ్యులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మృతునికి భార్య అమ్ములు, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడు స్వగ్రామం నరసన్నపేట దగ్గర లుకలాం కాగా, గత 30 ఏళ్లుగా ఉద్యోగరీత్యా జేఆర్‌పురం పంచాయతీలోని జీఎంఆర్ కాలనీలో నివాసముంటున్నాడు. జేఆర్‌పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. కాగా మృతదేహాన్ని తీసుకెళ్లకుండా, కంపెనీ వద్ద కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు.

ఉగాది పురస్కారాలు ..



సీఎం చంద్రబాబు చేతులమీదుగా పురస్కారాలు అందుకుంటున్న రాజారావు, సత్యవరప్రసాద్, రామకౌండిన్య

శ్రీకాకుళం కల్చరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన ఉగాది పురస్కారోత్సవాల్లో భాగంగా 2025 సంవత్సరానికి గాను, శ్రీకూర్మం గ్రామానికి చెందిన శ్రీభాష్యం సుందరరామ కౌండిన్య సీఎం నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా అవార్డు ఆదివారం అందుకున్నారు. కూచిపూడి నాట్యంలో విశేష కృషి చేసినందుకు ఈ అవార్డుకు ఎంపికయ్యారు. గత 25 ఏళ్లుగా కౌండిన్య రఘుపాత్రుని శ్రీకాంత్ వద్ద కూచిపూడి నాట్యంలో శిక్షణ పొందుతున్నారు.

డా.బీఎస్‌వీ ప్రసాద్‌కు పురస్కారం

కవిటి: రాష్ట్రస్థాయిలో ఈ ఏడాది ప్రకటించిన ఉగాది పురస్కారాలకు గానూ కవిటి మండలం కుసుంపురం గ్రామానికి చెందిన డాక్టర్ బొంతల కోటి సత్యవరప్రసాద్‌కు కళా విభాగంలో అవార్డు వరించింది. ఆదివారం విజయవాడలో జరిగిన వేడుకల్లో సీఎం చేతులమీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో ప్రస్తుతం సత్యవరప్రసాద్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

వృద్ధురాలి మెడలో పుస్తెలతాడు చోరీ

కంచిలి: ఇంట్లోని వెనుక గదిలో నిద్రిస్తున్న వృద్ధురాలి మెడలోని నాలుగు తులాల బంగారు పుస్తెలతాడు చోరీకి గురైంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని మండపల్లి పంచాయతీ పరిధి అమ్మవారిపుట్టుగ గ్రామానికి చెందిన బొడ్డ అమ్మాయమ్మ అనే వృద్ధురాలు తన ఇంట్లోని వెనుక గదిలో శనివారం రాత్రి నిద్రించింది. ఇంటి పెరడు వైపు వెనుక గది తలుపునకు గడియ లేదు. దీంతో నైలాను తాడును తలుపు చెక్కలకు కట్టి వృద్ధురాలు నిద్రపోయింది. అయితే అర్ధరాత్రి ఒంటి గంటన్నర సమయంలో గుర్తు తెలియని వ్యక్తి పెరడు తలుపునకు కట్టిన తాడును విప్పి వృద్ధురాలు నిద్రిస్తున్న గదిలోకి ప్రవేశించాడు. అనంతరం ఆమె మెడలో వేసుకొన్న బంగారు పుస్తెలతాడును తెంచుకొని పారిపోయాడు. దీన్ని గమనించిన వృద్ధురాలు కేకలు వేసింది. తర్వాత కుటుంబ సభ్యులు నిద్రలేచే వచ్చేసరికి దుండగుడు పారిపోయాడు. ఈ విషయమై వృద్ధురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కంచిలి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కంచిలి ఎస్ఐ పి.పారినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పారదర్శకంగా విచారణ చేపట్టాలి



ర్యాలీ అనంతరం జరిగిన సభకు హాజరైన క్రైస్తవులు

శ్రీకాకుళం కల్చరల్: డాక్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై పారదర్శకంగా విచారణ చేపట్టాలని జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్, జిల్లా క్రైస్తవ సంక్షేమ సంఘం సభ్యులు కోరారు. ఈ మేరకు నగరంలోని బాలికల హైస్కూల్ ఎదురుగా ఉన్న క్రిస్టియన్ వర్షిప్ సెంటర్ నుంచి కొన్నావీధిలో ఉన్న కీస్టోన్ చర్చి వరకు శాంతియుత ర్యాలీ ఆదివారం చేపట్టారు. అనంతరం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ప్రవీణ్ ప్రగడాలది ప్రమాదం కాదని, ఎవరో హత్య చేశారని అనుమానం వ్యక్తం చేశారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ చైర్మన్ డీఎస్‌వీఎస్ కుమార్, ఎస్ఎంయూపీఎఫ్ ప్రెసిడెంట్ రెవ.జాన్ జీవన్, సెక్రటరీ సీహెచ్ ప్రేమన్న, బిషప్ సామ్యూల్ మోజెస్, రెవ.పి.ఎస్.స్వామి, బిషప్ బి.బర్నబస్ తదితరులు పాల్గొన్నారు.